www.prajasakti.com

ప్రజాశక్తి

ఆదివారం 4 జూన్ 2023

5

వైఎస్ఆర్

ఎపిపిఎస్‌సి ఆయూష్ ఫలితాల్లో

పులివెందుల వైద్యుడికి మొదటి ర్యాంకు

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

ఎపిపిఎస్‌సి ఆయూష్ ఫలితాల్లో అసిస్టెంట్ ప్రొఫెసర్, ఆర్గనాన్ ఆఫ్ మెడిసిన్ విభాగంలో పులివెందుల పట్టణానికి చెందిన హోమియోపతి డాక్టర్ పసుపులేటి నాగ మణికంఠ రాష్ట్రస్థాయిలో మొదటి ర్యాంక్ సాధించారు. దాదాపు 20 ఏళ్ల తర్వాత నిర్వహించిన పరీక్షలో నాగ మణికంఠ మొదటి స్థానం సాధించడం పట్ల పలువురు హర్షం వ్యక్తం చేశారు. మణికంఠ పులివెందుల పట్టణంలో ఆర్టీసీ సర్కిల్ వద్ద హోమియో క్లినిక్ డాక్టర్‌గా పని చేస్తూ ఆయుష్ విభాగంలో రాష్ట్రస్థాయి ర్యాంక్ సాధించడం పట్ల పలువురు డాక్టర్లు ఆయనను అభినందించారు.

ఎర్రముక్కపల్లి ఆర్‌యుబి ఏర్పాటుకు

కసరత్తు

'పిఎం గతిశక్తి' కింద రూ.35 కోట్లు మంజూరు

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

కడప నగరంలోని ఎర్రముక్కపల్లి ఆర్‌యుబి ఏర్పాటుకు కసరత్తు ఊపందుకుంది. కేంద్ర ప్రభుత్వం ప్రధానమంత్రి గతిశక్తి పథకం కింద రూ.35 కోట్లు మంజూరుకు అంగీకరించింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు 50 శాతం వాటా కింద నిధులను భరించాల్సి ఉన్నట్లు తెలుస్తోంది. కేంద్రం పిఎం గతిశక్తి పథకం కింద 50 శాతం నిధులను కేటాయించనున్న నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం తన వాటా కింద 50 శాతం నిధులను కేటాయించడమే ఆలస్యమని తెలుస్తోంది. రాష్ట్ర ప్రభుత్వ సత్వరమే స్పందిస్తేనే ఆర్‌యుబి నిర్మాణ కార్యరూపం దాల్చే అవకాశం ఉంది. కలెక్టర్ పర్యవేక్షణలో రెవెన్యూ, కార్పొరేషన్, రైల్వే అధికారులు సంయుక్తంగా జాయింట్ తనిఖీలు చేయాల్సి ఉంది. అనంతరం ఆర్‌యుబి అలైన్‌మెంట్ నిర్మాణ స్వరూపాన్ని పరిశీలన చేయాల్సి ఉంది. ఎర్రముక్కపల్లి రైల్వే గేటుకు ఇరువైపులా భూసేకరణ మేరకు చేపట్టాల్సి ఉందనే అంశాన్ని అంచనా వేయాల్సి ఉంది. ఇరువైపులా ఎన్నిఇళ్లను తొలగించాల్సి ఉంది, ఎంత స్థలాన్ని తీసుకోవాల్సి ఉందనే అంశాన్ని పరిశీలన చేయాల్సి ఉంది. ఆర్‌యుబి అలైన్‌మెంట్ పరిశీలన అనంతరం ఇళ్లు, ఇళ్ల స్థలాల్ని కోల్పోయిన వారికి ఏమేరకు పరిహారాన్ని చెల్లించాల్సి ఉందనే అంశాన్ని అంచనా వేయాల్సి ఉంది. అనంతరం ఆర్‌యుబి నిర్మాణ పనులు చేపట్టాల్సి ఉన్నట్లు తెలుస్తోంది. ఆర్డబ్ల్యూ వ్యవస్థలో ప్రక్టర్ బేస్ట్ బ్రిడ్జి విధానం కింద ఆర్‌యుబి నిర్మాణ పనుల్ని చేపట్టే అవకాశాలను పరిశీలన చేస్తున్నట్లు తెలుస్తోంది. ఆర్‌యుబి కసరత్తువల్లే ఎర్రముక్కపల్లి రైల్వేగేటు అవతలి వైపు నగరాభివృద్ధి ఊపందుకునే అవకాశం ఉందని చెప్పవచ్చు.

ఎర్రముక్కపల్లి రైల్వేగేటు

హామీల అమలుకు పోరాటాలే శరణ్యం

ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షులు నాగభూషణం

ప్రజాశక్తి-ప్రొద్దుటూరు

ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పాదయాత్రలో ఇచ్చిన హామీల అమలుకు పోరాటాలు తప్ప మరోమార్గం కనిపించడం లేదని ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ (సిఐటియు) రాష్ట్ర అధ్యక్షులు నాగభూషణం అన్నారు. కార్మికుల సమస్యల పరిష్కారం కోరుతూ గత నెల 31న హిందూపురం నుంచి ప్రారంభమైన జీపుజాతా శనివారం రాత్రి ప్రొద్దుటూరుకు చేరుకుంది. విజయకుమార్ సర్కిల్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ సమస్యల పరిష్కారం కోరుతూ నాలుగేళ్లుగా పోరాటం చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోవడంలేదన్నారు. తాను సిఎం అయిన వెంటనే కార్మికుల సమస్యలు పరిష్కరిస్తానని హామీలిచ్చి గద్దెనెక్కిన వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయ్యాక నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడం శోచనీయం అన్నారు. 11పిఆర్‌సి ప్రకారం జీతాలు పెంచలేదన్నారు. ప్రభుత్వం ఇటీవల తీసుకొచ్చిన ఔట్‌సోర్సింగ్ విధానంతో కార్మికుల పరిస్థితి పెనంలో నుంచి పొయ్యిలో పడినట్లయిందని వాపోయారు.. సంక్షేమ పథకాలు అందడంలేదని, ఇఎస్‌ఐ అమలు చేయడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. సమస్యలు పరిష్కరించకపోతే ఈ నెల 8న విజయవాడలో మరో పోరాటానికి పిలుపునిస్తున్నామని చెప్పారు. గత ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు పట్టిన గతి ప్రస్తుత ముఖ్యమంత్రి జగన్‌ను తెచ్చుకోవద్దని కోరుతున్నామని తెలిపారు. రాష్ట్ర ఉపాధ్యక్షులు ముత్యాలరావు మాట్లాడుతూ ఎన్నికలకు ముందు చంద్రబాబు తెచ్చిన 279 జిఒకు వ్యతిరేకంగా మాట్లాడిన ప్రస్తుత ముఖ్యమంత్రి జగన్ ఇప్పుడు ఆ ఊసే మరిచిపోయారన్నారు. గడపగడప కార్యక్రమంలో 98 శాతం హామీలు అమలు చేశాం అని చెప్పడం పచ్చి అబద్ధం అన్నారు. నాలుగేళ్లుగా కార్మికులను ముఖ్యమంత్రి జగన్ మోసం చేస్తూనే ఉన్నారని చెప్పారు. పారిశుధ్య కార్మికులకు రూ.6 వేలు భయంతో ఇచ్చిందే కానీ, వారిపై ప్రేమతో కాదని తెలిపారు. మనలో మనకు ప్రభుత్వం గొడవపెడుతోందన్నారు. ప్రధాని మోడీ కార్మిక చట్టాలను కాలరాసి తనకు అనుకూలంగా పార్లమెంట్‌లో బిల్లు పెడితే ఇందుకు వైసిపి , టిడిపి రెండూ మద్దతు ఇవ్వడంరెండు నాల్కుల ధోరణికి నిదర్శనమని చెప్పారు. రాష్ట్రంలోని 123 మున్సిపాల్టీలలోని 45వేల మంది కార్మికులతో పోరాటానికి సిద్ధం అవుతామని హెచ్చరించారు. కార్యక్రమానికి ముందు నాట్యమండలి కళాకారులు గీతాలను ఆలపించారు. కార్యక్రమంలో రాష్ట్ర మాజీ కార్యదర్శి నాగేంద్రబాబు, రాష్ట్రకమిటీ సభ్యులు ఎటిఎం నాగరాజు, గోపి, లక్ష్మీనారాయణ, ప్రజానాట్యమండలి కళాకారులు శ్రీనివాసులు, రామాంజి, పుల్లయ్య, కృష్ణవేణి, స్థానిక కార్మిక సంఘ నాయకులు సత్యనారాయణ, విజయకుమార్, సాల్మన్, చంటి, రాఘవ, రవణమ్మ, లక్ష్మీదేవి, నీతమ్మ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న రాష్ట్ర అధ్యక్షులు నాగభూషణం

పసుపు, కెపి ఉల్లికి శాశ్వత పరిష్కారం

మైదుకూరు బహిరంగ సభలో నారా లోకేష్

మైదుకూరు బహిరంగ సభలో మాట్లాడుతున్న నారాలోకేష్

ప్రజాశక్తి-చాపాడు

మైదుకూరు నియోజకవర్గంలో వ్యవసాయం మీద ఆధారపడి రైతులు జీవనం సాగిస్తున్నారని, ఇక్కడి ప్రధాన పంటలైన పసుపు, ఉల్లి, వరి రైతుల సమస్యలకు టిడిపికి అధికారంలోకి రాగానే శాశ్వత పరిష్కారం చూపుతామని టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ సూచించారు. యువగళం పాదయాత్రలో భాగంగా శనివారం మైదుకూరు నాలుగు రోడ్ల కూడలిలో బహిరంగ సభను నిర్వహించారు. సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసిపి అధికారంలోకి వచ్చిన తర్వాత రాజోలి ఆనకట్టను నిర్మిస్తామని శిలాఫలకం వేసి నాలుగు సంవత్సరాలు పూర్తయినా ఏమాత్రం పట్టించుకోవడం లేదన్నారు. రైతు పండించిన పంటకు గిట్టుబాటు ధర కల్పించలేని స్థితిలో ప్రభుత్వం ఉందన్నారు. బిసిలు పడుతున్న కష్టాలు తాను చూశానని 26 వేల అక్రమ కేసులు, నిధులు, కుర్చీలు లేని కార్పొరేషన్లు ఇచ్చారన్నారు. టిడిపి అధికారంలోకి వచ్చిన వెంటనే ఉపకులాల వారీగా నిధులు, బిసిల కోసం ప్రత్యేక రక్షణ చట్టం తీసుకొస్తామన్నారు. డాక్టర్ సుధాకర్ దగ్గర నుంచి డాక్టర్ అచ్చెన్న వరకూ జగన్ పాలనలో దళితుల్ని కిరాతకంగా చంపారన్నారు. దళితుల్ని చంపడానికి జగన్ వైసిపి నాయకులకు స్పెషల్ లైసెన్స్ ఇచ్చాడన్నారు. 27 దళిత సంక్షేమ కార్యక్రమాలు రద్దు చేసాడన్నారు. టిడిపి అధికారంలోకి వచ్చిన వెంటనే దళితులను వేధించిన వారిని కఠినంగా శిక్షిస్తామని జగన్ రద్దు చేసిన 27 దళిత సంక్షేమ కార్యక్రమాలను తిరిగి ప్రారంభిస్తామన్నారు. పోతిరెడ్డిపాడు హెడ్‌రెగ్యులేటర్, తెలుగుగంగ కాలువ, కెసి కెనాల్, నిప్పులవాగు కాలువల సామర్థ్యాన్నిపెంచుతామని హామీ ఇచ్చి జగన్ మరిచారన్నారు. పెండింగ్ ప్రాజెక్టులు అన్ని పూర్తి చేస్తామని ఇచ్చిన ఒక్క హామీ నిలబెట్టుకోలేకపోతున్నారని పేర్కొన్నారు. గత టిడిపి హయాంలో సాగు, తాగునీటి ప్రాజెక్టులు, రోడ్లు, సిసి రోడ్లు, డ్రైనేజ్ ఇలా అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామన్నారు. నియోజకవర్గంలో కాలేజీలు, కమ్యూనిటీ భవనాలు కట్టింది టిడిపి అని గుర్తుచేశారు. కార్యక్రమంలో టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, కడప జిల్లా అధ్యక్షులు లింగారెడ్డి, మాజీ ఎమ్మెల్సీ బీటెక్ రవి, టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి పుట్టా సుధాకర్ యాదవ్, ఆయన కుమారుడు మహేష్ యాదవ్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

లోకేష్‌ను కలిసిన ఉల్లి రైతులు

ఉల్లి రైతులు యువనేత లోకేష్‌ను కలిసి తాము ఎదుర్కొంటున్న సమస్యలపై వినతిపత్రం సమర్పించారు. నియోజకవర్గంలో పండించే విదేశీరకం కెపి ఉల్లి పంటను ప్రభుత్వమే గిట్టుబాటు ధర ఇచ్చి కొనుగోలు చేయాలని కోరారు. కెపి రకం ఉల్లి ఎకరా పంటకు 15 నుండి 20 క్వింటాళ్ల దిగుబడి మాత్రమే వస్తోందని ఎకరాకు లక్ష రూపాయలు ఖర్చవుతుందని తెలిపారు. క్వింటాకు రూ.10వేలు ఇస్తేనే గిట్టుబాటు అవుతుందని, ఆగష్టు నెలలో ఉల్లి కొనుగోలు కేంద్రం పెట్టి కొనుగోలు చేయాలన్నారు. దళారులు పంట కొనుగోలు చేయడం వల్ల రైతులకు గిట్టుబాటు ధర రావడం లేదని తెలిపారు. టిడిపి అధికారంలోకి వచ్చాక ఉల్లి రైతులకు న్యాయం చేయాలని కొరగా నారా లోకేష్ స్పందిస్తూటిడిపి అధికారంలోకి వచ్చాక మైదుకూరులో ఉల్లి కొనుగోలు కేంద్రం ఏర్పాటుచేసి రైతులను ఆదుకుంటామని రైతులకు గిట్టుబాటు ధర కల్పించి, దళారీల దోపిడీ బారినుంచి కాపాడతామన్నారు. ఉల్లి రైతులకు అవసరమైన నాణ్యమైన విత్తనాలు, ఎరువులను సబ్సిడీపై అందజేస్తామని హామీ ఇచ్చారు.

మిల్లెట్స్ ఆహారం ఆరోగ్యానికి మేలు

ప్రజాశక్తి - కడప అర్బన్

యువత మిల్లెట్స్‌తో కూడిన ఆహార విధానం అలవాటు చేసుకోవాలని తద్వారా మంచి ఆరోగ్య వంతులుగా జీవించగలుగుతారని నెహ్రు యువ కేంద్ర జిల్లా యువ అధికారి మణికంఠ పిలుపునిచ్చారు. శనివారం భారత ప్రభుత్వం, యువజన వ్యవహారాలు, క్రీడల మంత్రిత్వశాఖ నెహ్రూ యువ కేంద్రం ఆధ్వర్యం లో 'మిషన్ లైఫ్ మేరీ లైఫ్ లో భాగమైన లైఫ్ స్టైల్ ఫర్ ఎన్విరాన్‌మెంట్' అనే అంశంలో భాగంగా ప్రమోషన్ ఆఫ్ మిల్లెట్స్ కార్యక్రమం స్థానిక నీహార్ స్కిల్ ఎడ్యుకేషన్ ట్రైనింగ్ సెంటర్ లో నిర్వహించారు. ముఖ్య అతిథి గా హాజరైన నెహ్రు యువ కేంద్ర జిల్లా యువ అధికారి మణికంఠ మాట్లాడుతూ చిరు ధాన్యాలతో కూడిన ఆహారపు అలవాట్లు యువత అలవాటు చేసుకుని ఆరోగ్యంగా ఉండటంతో పాటు రాబోయే తరాలకు ఆదర్శంగా నిలవాలని కోరారు. చిరు ధాన్యాల ఎక్సపర్ట్ కల్లూరి రఘు రమి రెడ్డి మాట్లాడుతూ కొర్రలు, ఉదాలు, అవిసెలు, రాగులు, సజ్జలు, జొన్నల ద్వారా కలిగే లాభాలను తెలియజేశారు. అనంతరం చిరు ధాన్యాల ప్రదర్శన, వాటిని ఉపయోగించి చేసిన పిండి పదార్థాలు, మిల్లెట్స్‌తో కూడిన తిను బండరాల ప్రదర్శన యువతను ఎంతగానే ఆకట్టుకుంది. కార్యక్రమంలో నీహార్ స్కిల్ ఎడ్యుకేషన్ సుబ్బరామిరెడ్డి, నెహ్రు యువ కేంద్ర జాతీయ సేవ కార్యకర్తలు మల్లికార్జున, బాలాజీ, రంజిత్, కార్తీక్, అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

నకిలీ ఆర్‌ఎంపిలపై కఠిన చర్యలు : డివైఎఫ్ఐ

ప్రజాశక్తి - బద్వేలు

బద్వేల్ నియోజకవర్గంలోని అన్ని మండలాలలో వచ్చిరాని వైద్యంతో ఆర్‌ఎంపి డాక్టర్లుగా చలామణి అవుతూ ఎటువంటి ప్రభుత్వ అనుమతులు లేకుండా ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్న వారిపైఐ డిఎంహెచ్ఒ, ఉన్నతాధికారులు తనిఖీలు చేసి చర్యలు తీసుకోవాలని డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు ముడియం చిన్ని డిమాండ్ చేశారు. శనివారం స్థానిక సుందరయ్య భవనంలో బద్వేల్ పట్టణ నాయకులతో కలిసి విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ బద్వేల్ నియోజకవర్గంలో శంకర్ దాదా ఆర్‌ఎంపిలుగా వచ్చిరాని వైద్యంతో ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారని పేర్కొన్నారు. ఏదో ఒక ఆస్పత్రిలో పనిచేసిన అనుభవంతో ఆర్‌ఎంపీ డాక్టర్లుగా చలామణి అవుతున్నారని వాపోయారు. వీరి నిర్వాహకం వల్ల చాలా గ్రామాల్లో వైద్యం వికటించి రోగులు చనిపోవడం పరిపాటిగా మారిందని తెలిపారు. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు స్పందించి ప్రభుత్వ అనుమతులు లేకుండా, ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్న ఆర్‌ఎంపి వైద్యులపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో జిల్లా వ్యాప్తంగా డివైఎఫ్ఐ యువజన సంఘం, ప్రజలను కలుపుకొని పెద్ద ఎత్తున ఆందోళన పోరాటాలు కొనసాగిస్తామని సంబంధిత అధికారులను హెచ్చరించారు. కార్యక్రమంలో డివైఎఫ్ఐ పట్టణ నాయకులు ప్రవీణ్ కుమార్ మహిళా కన్వీనర్ సి గురుదేవి పాల్గొన్నారు.

తహశీల్దార్ కార్యాలయాన్ని పరిశీలించిన జెసి

పోరుమామిళ్ల టౌన్ : స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో జాయింట్ కలెక్టర్ గణేష్ కుమార్ శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పులివెందులకు రెండు రోజుల కిందట బదిలీపై వెళ్లిన తహశీల్దార్ విజయకుమారి ఆధ్వర్యంలో పాత తహశీల్దార్ కార్యాలయానికి మర్మతులు చేయించారు. ఈ భవనాన్ని నూతన తహశీల్దార్ గంగయ్య, ఆర్‌డిఒ ఆకుల వెంకటరమణతో కలిసి పరిశీలించారు.

నేడు 'కేతు' సంస్మరణ సభ

కడప అర్బన్: ప్రముఖ కథా రచయిత, కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కార గ్రహీత ఆచార్య కేతు విశ్వనాథరెడ్డి సంస్మరణ సభ ఈనెల 4న ఉదయం 9 గంటలకు సి.పి. బ్రౌన్ గ్రంథాలయంలో నిర్వహించనున్నట్లు అభ్యుదయ రచయితల సంఘం జిల్లా అధ్యక్షులు ఆచార్య ఎన్. ఈశ్వర రెడ్డి, ప్రధాన కార్యదర్శి డాక్టర్ తుమ్మలూరు సురేష్ బాబు ఒక సంయుక్త ప్రకటనలో తెలిపారు. సభకు ఆత్మీయ వక్తలు గా అరసం రాష్ట్ర గౌరవాధ్యక్షురాలు డాక్టర్ కె. సంజీవమ్మ, సిపిఐ రాష్ట్ర నాయకులు జి.ఓబులేసు, జిల్లా కార్యదర్శి గాలి చంద్ర, సిపిఎం జిల్లా కార్యదర్శి జి. చంద్రశేఖర్, సి.పి. బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం సంచాలకులు, ఆచార్య మూల మల్లికార్జునరెడ్డి, ప్రముఖ కథా నవలా రచయిత సన్నపురెడ్డి వెంకట్రామిరెడ్డి, ప్రముఖ కథా రచయిత పాలగిరి విశ్వప్రసాద్, ప్రముఖ కథా రచయిత తవ్వా ఓబుల్ రెడ్డి జానమద్ది సాహితీ పీఠం మేనేజింగ్ ట్రస్టీ జానమద్ది విజయ భాస్కర్ హాజరవుతున్నారని తెలిపారు.

నేడు పుష్పగిరి క్షేత్రంలో గిరి ప్రదక్షిణ

ప్రజాశక్తి- వల్లూరు

పుష్పగిరి క్షేత్రంలో ప్రతి పౌర్ణమికి నిర్వహించే కైలాసగిరి ప్రదక్షిణను నేడు నిర్వహిస్తున్నట్లు న్యాయవాది, ఇంటెక్ లైఫ్ సభ్యులు సట్టి భారవి ప్రకటించారు. పుష్పగిరి పీఠాధిపతి విద్యాశంకర భారతి స్వామివారు ఆశీర్వాదాలతో ఉదయం 6గంటలకు ప్రదక్షిణ ఉంటుందన్నారు. వ్యాస పూర్ణిమ, బుద్ధ పౌర్ణిమ కలిసి రావడంతో మరింత విశిష్టత చేకూరిందన్నారు. భక్తులు తెల్లవారుజామున 5 గంటలకల్లా పుష్పగిరి క్షేత్రానికి చేరుకోవాలని కోరారు. భక్తుల సౌకర్యార్థం నిమిత్తం ఉచితంగా బుడ్డాయపల్లె వాసి బసిరెడ్డి వాహన సౌకర్యం కల్పించారని చెప్పారు. ఉదయం అల్పాహారాన్ని దాతలు చింతకుంట వేణుగోనపాల్‌రెడ్డి, కొమ్మూరు కిరణ్ ఏర్పాటు చేశారని తెలిపారు. మజ్జిగ, నీరు అందించేందుకు దాతలు ముందుకు వచ్చారన్నారు. భక్తులు సంప్రదాయ దుస్తులతో హాజరు కావాలని కోరారు. ప్రజలు సేద దీరేందుకు చెట్ల కింద దాత చెన్నూరు వాసి హరిప్రసాద్ అరుగులు ఏర్పాటు చేశారన్నారు.

ఉత్సాహంగా బండలాడుగు పోటీలు

ప్రజాశక్తి-కలసపాడు

మండలంలోని ముదిరెడ్డిపల్లిలో అభయ ఆంజనేయ స్వామి ఆరవ వార్షికోత్సవ సందర్భంగా శనివారం సర్పంచ్ పుల్లెం నారాయణ, గుర్రమ్మల ఆధ్వర్యంలో శనివారం బండలాడుగు పోటీలు నిర్వహించారు. ఎంతో ఉత్సాహంగా సాగిన పోటీల్లో ప్రథమ బహుమతిని పల్నాడు జిల్లాకు చెందిన దప్పిల అంజిరెడ్డిని సర్పంచ్ పుల్లం నారాయణ చేతుల మీదుగా రూ. 50 వేలు అందజేశారు. రెండో బహుమతిని దాత కీ.శే. సుబ్బరాయుడు కుటుంబం రూ. 40 వేలు, మూడు బహుమతిని కృష్ణారెడ్డి, వారి సతీమణి, బైరెడ్డి మానస రూ. 30 వేలు, నాల్గో బహుమతిని బైరెడ్డి వెంకటరెడ్డి సతీమణి వెంకటలక్షుమ్మ, కుటుంబ సభ్యులు రూ. వేలు అందజేశారు. అనంతరం చెక్కభజన, కోలాట బృందాలు సర్పంచ్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు.

నేటి నుంచి దర్గా ఉరుసు ఉత్సవాలు

కడప అర్బన్ : నగరంలోని రహమతుల్లా వీధిలో వెలసిన చారిత్రాత్మకమైన చాంద్ ఫిరా గుంబద్ దర్గా ఉరుసు ఉత్సవాలు ఈనెల 4 నుంచి 6 వరకు నిర్వహిస్తున్నామని దర్గా ముతవల్లి అమీరున్నిసా ఒక ప్రకటనలో తెలిపారు. 4న రాత్రి గంధం, 5న ఉరుసు, 6న తహలీల్ కార్యక్రమాలు ఉంటాయని పేర్కొన్నారు. అలాగే ఉరుసు, తహలీల్ రెండు రోజుల పాటు గొప్ప ఖవ్వాలి పోటీ ఉంటాయని తెలిపారు ముస్లిం సోదరులు, ప్రజలు అత్యధిక సంఖ్యలో పాల్గొని ఉరుసు ఉత్సవాలను విజయవంతం చేయాలని తెలిపారు.

పచ్చిరొట్టతో అధిక దిగుబడులు

పోరుమామిళ్ల : పచ్చిరొట్ట పంట దిగుబడిలో ప్రధాన భూమిక పోషిస్తుందని ఉద్యానవన శాఖ సలహాదారు సంబటూరు ప్రసాద్ రెడ్డి పేర్కొన్నారు. శనివారం ఉదయం మండల వ్యవసాయ శాఖ అధికారి వరహరి కుమార్ ఆధ్వర్యంలో ఆర్.బి.కె ఇన్‌ఛార్జి సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పచ్చి రొట్టె పంట భూసారం పెంపులో దిట్ట అన్నారు. భూముల్లో పచ్చిరొట్ట ఎరువు సాయంతో సారవంతంగా మార్చుకోవచ్చని సూచించారు. ఇందులో జీలుగ సాగు చక్కటి ఫలితాలు ఇస్తుందన్నారు. నేల స్వభావాన్ని బట్టి జీలుగ సాగు చేసుకుంటే ఆపై వేసే పంటలకు అనుకూలంగా ఉంటుందన్నారు. పచ్చిరొట్ట ఎరువుల కోసం నిర్దేశించిన మొక్కలను పొలంలో కలియదున్నడం వల్ల అవి కుళ్లి మొక్కలకు సారవంతమైన భూమిని అందిస్తుందన్నారు. ప్రభుత్వం అందజేస్తున్న వ్యవసాయ పథకాలను రైతుల ముంగిటికీ చేర్చడంలో ఆర్‌బికె సిబ్బంది కీలక పాత్ర పోషించాలని సూచించారు.

సైకిల్ తొక్కడం ఆరోగ్యానికి మంచిది

కడప అర్బన్ : సైకిల్ తొక్కడం ఆరోగ్యానికి మంచిదని వైద్య ఆరోగ్య అధికారి డాక్టర్ ఖాదరవల్లి అన్నారు. శనివారం ప్రపంచ సైకిల్ దినోత్సవం సందర్భంగా నగరంలో సైకిల్ ర్యాలీ నిర్వహించారు. స్టేట్ గెస్ట్ హౌస్ నుంచి సైకిల్ ర్యాలీని జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సైకిల్ తొక్కడం వల్ల కండరాలు బలపడతాయని తెలిపారు. ఆకలి అలసట నిద్ర బాగా వస్తుందని చెప్పారు. రక్తప్రసరణ సజావుగా సాగుతుందని పేర్కొన్నారు. గుండె జబ్బు, కేన్సర్, షుగర్ వ్యాధులు ధరి చేరవని తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ ఉమామహేశ్వరరావు, డాక్టర్ శశి భూషణ్ రెడ్డి, డెమో ప్రమీల, డీఎంఒ మనోరమ, డాక్టర్ ఉబేదుల్లా, ఖాజా మొహిద్దిన్ పాల్గొన్నారు.

క్రీడాకారులను అభినందించిన ఎమ్మెల్సీ

ప్రజాశక్తి-పోరుమామిళ్ల టౌన్

ఈనెల 6 నుంచి 12 వరకు ఢిల్లీల్లో నిర్వహించబోయే ఆతీయ స్థాయి స్కూల్ గేమ్స్ తేక్వాండో పోటీలకు ఎంపికైన క్రీడాకారులు ఎస్. సాయిప్రీతి, ఎస్. భవ్యను శనివారం ఎమ్మెల్సీ డి.సి. గోవిందరెడ్డి అభి నందించారు. గత ఏడాది డిసెంబర్‌లో కడప జిల్లా రైల్వే కోడూరులో నిర్వ హించిన రాష్ట్రస్థాయి పోటీల్లో బంగారు పతకాలు సాధించి, జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. జాతీయ స్థాయి పోటీలలో మంచి ప్రతిభ కనపరచి పోరుమామిళ్లకు, జిల్లాకు, రాష్ట్రానికి కడప జిల్లాకి, మన రాష్ట్రానికి మంచిపేరు తేవాలని ఆకాక్షించారు. క్రీడాకారులను జాతీయ స్థాయి పోటీలకు వెళ్లేలా శిక్షణ ఇచ్చిన మాస్టర్ నయాబ్ రసూల్‌ను అభినందించారు. కార్యక్రమంలో పోరుమామిళ్ల పట్టణ వైసిపి నాయకులు చిత్తా రవిప్రకాష్‌రెడ్డి, సి. బాషా, రాజీవ్ బాషా, హబీబ్ బాషా, ఇషాక్, అల్లా, వసంత, సాయి పాల్గొన్నారు.

వాటర్‌ప్లాంట్ ప్రారంభం

ప్రజాశక్తి-పోరుమామిళ్ల టౌన్

మండలంలోని తోకలపల్లిలో కాటసాని వెంకటరెడ్డి ఏర్పాటుచేసిన మినరల్ వాటర్ ప్లాంట్‌ను ఎమ్మెల్సీ డి.సి గోవిందరెడ్డి శనివారం ప్రారం భించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వెంకట రెడ్డి చేపడుతున్న సేవా కార్యక్రమాలలో భాగంగా మినిరల్ వాటర్ ప్లాంట్‌ను ఏర్పాటు చేయడం ఎంత సంతోషమన్నారు.రూ. 5లకే తోకలపల్లి గ్రామస్తులకు శుద్ధమైన నీటిని అందించడం అభినందనీయమన్నారు. ఆయన చేతుల మీదుగా 150 కుటుంబాల వారికి వాటర్ క్యాన్లను ఉచితంగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ కె. రమణరెడ్డి రంగసముద్రం గ్రామపంచాయతీ సర్పంచ్ చిత్త రవి ప్రకాష్ రెడ్డి, మండల ఉపాధ్యక్షులు రాజశేఖర్, జడ్‌పిటిసి ముత్యాలప్రసాద్, సర్పంచ్ కె. రమణారెడ్డి, రాయపర్తి సుబ్బరామిరెడ్డి, జి. నారాయణ, వెంకటయ్య, గ్రామస్తులు పాల్గొన్నారు.

నిరాశ్రయులకు అన్నదానం

ప్రజాశక్తి - కడప

అన్నదానం చేస్తున్న చంద్రశేఖర్‌రెడ్డి

తిరుమల టింబర్ డిపో వ్యవస్థాపకులు కీ.శే. కంచి వెంకట సుబ్బయ్య జ్ఞాపకార్థం వారి కుమారులు కంచి గోపికృష్ణ కంచి సురేంద్రనాథ్ (సూరి) సహకారంతో శనివారం కడప నగరంలోని పాత రిమ్స్‌లో ఉన్న ఆదరణ నిరాశయుల వసతి గృహంలో వైఎస్‌ఆర్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు వైఎస్ జగన్ యువసేన వ్యవ స్థాపక అధ్యక్షులు మలిరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి ఆధ్వ ర్యంలో అనాథ వృద్ధులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా చంద్రశేఖర్ రెడ్డి మాట్లా డుతూ తిరుమల టింబర్ డిపో వ్యవ స్థాపకులు కీర్తిశేషులు కంచి వెంకట సుబ్బయ్య కడప నగరంలో వ్యాపార రంగంలో ఎంతోమందికి జీవనాధారం కల్పించారని చెప్పారు. భవిష్యత్తు లోనూ పేదలకు, వృద్ధులకు, విద్యార్థులకు ఉపయోగపడే సామూహిక సేవా కార్యక్రమాలు చేపట్టాలని ఆకాక్షించారు. కార్యక్రమంలో ఆదరణ నిరాశల వ్యవస్థాపకులు విజయబాబు, డి సుబ్బరాయుడు, మాధవ్ రెడ్డి, రవికుమార్ పాల్గొన్నారు.

మేరీ మృతికి నివాళి

ప్రజాశక్తి- కడప

కాంగ్రెస్ పార్టీ హ్యూమన్ రైట్స్ జిల్లా అధ్యక్షులు పాలగిరి శివ తల్లి మేరీ కొద్దిరోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ మృతి చెందిందారు. మృతదేహాన్ని శనివారం ఊటుకూరులోని ఆమె గృహంలో కాంగ్రెస్ పార్టీ నగర అధ్యక్షులు వై విష్ణు ప్రీతం రెడ్డి, కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శి చీకటి చార్లెస్, విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షులు మామిళ్ళ బాబు సందర్శించి నివాళులర్పించారు. పాలగిరి శివ తల్లి మేరీ మృతి బాధాకరమని వారు పేర్కొన్నారు. కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.

దేశానికి తీవ్ర అన్యాయం

ప్రజాశక్తి - కడప

మాట్లాడుతున్న ప్రసాద్‌గౌడ్

స్వార్థ రాజకీయాల కోసం దేశానికి, రాష్ట్రానికి మోడీ, జగన్మోహన్ రెడ్డి తీరని అన్యాయం చేస్తున్నారని కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి ప్రసాద్ గౌడ్ అన్నారు. శనివారం స్థానిక కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యాల యంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మా ట్లాడారు. మోడీ ,జగన్ తమ స్వార్థ రాజకీ యాలతో ఈ దేశానికి, ఈ రాష్ట్రానికి తీవ్రమైన అన్యాయం చేస్తున్నారని ఆరో పించారు. మోడీ 9 ఏళ్ల పాలన అహంకార, అవినీతి ,విద్వేష పూరిత పాలనకు నిదర్శనమని విమర్శించారు. రైతులు, యువకులు, కార్మికులు, మహిళలు , బీసీలు .మైనార్టీలు ,దళితులు, గిరిజనులు, ఆదివాసీలు, వెనుక బడిన వర్గాలు వీరి పాలనలో అణిచివేతకు గురయ్యారని అన్నారు. రాష్ట్రానికి ప్రత్యేక హోదా, విభజన హామీల అమలు ఒక కాంగ్రెస్ పార్టీ వల్లనే సాధ్యమన్నారు.

తహశీల్దార్‌ను కలిసిన రేషన్ డీలర్లు

ప్రజాశక్తి- చెన్నూరు

నూతన తహశీల్దార్‌గా బాధ్యతలు చేపట్టిన సరస్వతిని మం డలంలోని రేషన్ డీలర్లు శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా తహశీల్దార్ సరస్వతి మాట్లాడుతూ మండలంలో ఎక్కడైనా రేషన్ పంపిణీలో సమస్యలు ఉన్నట్లయితే తన దృష్టికి తేవాలని అన్నారు. మండ లంలో ఎన్ని రేషన్ దుకాణాలున్నాయి ఎక్కడైనా పంపిణీ వ్యవస్థ ఇబ్బందులు కలుగుతున్నాయా అనే విషయాల గురించి అడిగి తెలుసుకున్నారు. ప్రతి నెలా డీలర్ల సమావేశం ఏర్పాటు చేస్తామని అందుకు ప్రతి డీలరూ హాజరు కావాలని అన్నారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు యాసిన్, రామకృష్ణ, సీతారామయ్య, బాష పాల్గొన్నారు.

ఏమయ్యాయి.. జగనన్న హామీలు?

కడప అర్బన్ : మున్సిపల్ కార్మికులకు ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి ఇచ్చిన హామీలు ఏమయ్యాయని ఎపి మున్సిపల్ వర్కర్స్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ (సిఐటియు అనుబంధం) జిల్లా, నగర అధ్యక్షులు కంచుపాటి తిరుపాల్, సుంకర రవి ప్రశ్నించారు. శనివారం పాత మున్సిపల్ కార్యాలయం ఎదుట గేట్ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం ఏర్పడి నాలుగేళ్లయినా మునిసిపల్ కార్మికులకు ఇచ్చిన మాట, హామీలు అమలు కు నోచుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. కనీసం వారిని ప్రజలు గా అయిన గుర్తించడం లేదని చెప్పారు. రెండేళ్ల కూడా సర్వీస్ లేని సచివాలయం సిబ్బందికి జీతాలు పెంచి పర్మినెంట్ చేశారని పేర్కొన్నారు. 15, 20 సంవత్సరాలు పైబడి పని చేస్తున్న మునిసిపల్ కార్మికులను రెగ్యులర్ ఎందుకు చేయలేదని ప్రశ్నించారు. మున్సిపల్ కార్మికులు ఏమి పాపం చేశారని పేర్కొన్నారు. వేల కోట్లు ఖర్చు చేసి రేషన్ డీలర్‌లకు ఆటోలను, స్వచ్ఛ భారత్ పేరు మీద చెత్త తరలించే ఆటోలను, హోమ్ గార్డులకు స్కూటీ లు, రైతులకు ట్రాక్టర్ లు, డ్వాక్రా మహిళలకు రుణాలు,విద్యార్థులకు విద్య,వసతి దీవెన, ఇలా అనేక రకాలుగా పలు పథకాల అమలు చేస్తున్నరని చెప్పారు. మునిసిపల్ కార్మికులు ఒకే ఒక్క డిమాండ్ రెగ్యులర్ చేయాలని కోరారు. ముఖ్యమంత్రి స్పందించి ఇచ్చిన మాట హామీలు నిలబెట్టు కోవాలని డిమాండ్ చేశారు. లేని పక్షం లో రాబోయే రోజుల్లో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ముఖ్య సభ్యులు ,కార్మికులు, మహిళ కార్మికులు, డ్రైవర్లు, వాటర్ ట్యాంకు డ్రైవర్లు, లోడర్లు పాల్గొన్నారు.

యువగళం పాదయాత్రను విజయవంతం చేయాలి

కడప అర్బన్ : తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ యువగళం పాదయాత్ర కడప అసెంబ్లీ నియోజకవర్గంలోకి ప్రవేశిస్తున్న సందర్భంగా టిడిపి కార్యకర్తలు, ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని కడప నియోజకవర్గ ఇన్‌ఛార్జి వి.ఎస్. అమీర్‌బాబు అన్నారు. శనివారం డివిజన్, యూనిట్, క్లస్టర్ ఇన్‌ఛార్జీలతో టిడిపి కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ముఖ్యమంత్రి సొంత జిల్లాలో నారా లోకేష్ పాదయాత్రను విజయవంతం చేసి జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వాన్ని మట్టిలో కలపాలని చెప్పారు. లోకేష్ పాదయాత్ర కడప చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయేలాగా శ్రేణులు కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ కార్యదర్శిలు బి. హరి ప్రసాద్, ఎస్. గోవర్ధన్ రెడ్డి, నగర అధ్యక్షులు శివకొండ రెడ్డి, రైతు నాయకుడు జి. లక్ష్మిరెడ్డి, ఓబుల్ రెడ్డి, ఆమూరి బాల దాసు, నక్కల శివరాం, జల తోటి జయకుమార్, మేకల వెంకటేష్ యాదవ్, బురి రెడ్డయ్య యాదవ్, సానపరెడ్డి రవిశంకర్ రెడ్డి, జిలాని బాష, నాసర్ అలీ, మాసాపేట శివ, ఆదిల్, విశ్వనాధ్, అనిల్, మాస కోదండరాం, కోయిలకుంట శ్రీనివాసులు, భరత్ కుమార్, నాయకులు పాల్గొన్నారు.

రైలు ప్రమాద బాధితుల కోసం హెల్ప్‌లైన్

కడప : శుక్రవారం ఒడిశా రాష్ట్రంలోని బాలేశ్వర్ జిల్లాలో జరిగిన ఘోర రైలు ప్రమాదంలో వైఎస్‌ఆర్ జిల్లాకు చెందిన బాధితులు ఉంటే వారి వివరాల తక్షణ సమాచారం తెలుసుకునేందుకు వారి కుటుంబ సభ్యులు 08562-246344లో సంప్రదించాలని కలెక్టర్ వి.విజయ్ రామరాజు శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కడప రెవెన్యూ డివిజనల్ అధికారి 984990 4117లోనూ సంప్రదించాలని కడప ఆర్‌డిఒ పి.ధర్మ చంద్రారెడ్డి పేర్కొన్నారు.

పోరుబాట

ప్రజాదృష్టి

జిల్లాలోని ఉపాధ్యాయలోకం మరోసారి ఉద్యమబాట పట్టింది. సిపిఎస్ స్థానంలో పాతపెన్షన్ విధానాన్ని అమలు చేయాలని కోరుతూ మరోసారి ఉద్యమ గళాన్ని వినిపించింది. ఉమ్మడి కడప జిల్లాలోని సుమారు 12 వేల మంది ఉపాధ్యాయులు బోధనావృత్తిలో కొనసాగుతున్నారు. వీరందరూ ఉమ్మడిగా తమ న్యాయమైన హక్కుల్ని సాధించుకోవడానికి కదలాల్సి ఉంది. వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి 2019 సార్వత్రిక ఎన్నికల సందర్భంగా చేపట్టిన పాదయాత్ర సందర్భంగా సిపిఎస్ రద్దు చేస్తానని హామీనిచ్చిన సంగతి తెలిసిందే. ఐదేళ్లుగా సిపిఎస్ రద్దు హామీని అమలు చేయాలని కోరుతూ ఉద్యమభేరీ మోగించారు. వేసవి సెలవుల నేపథ్యంలో జిల్లాలోని ఉపాధ్యాయ నాయకత్వం తాజాగా కలెక్టరేట్ ఎదుట రిలేదీక్షలకు దిగడం చర్చనీయాంశంగా మారింది. గతంలో హౌస్ అరెస్టులు చేయడం, ఎక్కడికి అక్కడ అదుపులోకి తీసుకోవడం, నోటీసులు అందజేయడం వంటి పలు రకాలుగా ఉపాధ్యాయులపై నిరసనలపై ఉక్కుపాదం మోపిన సంగతి తెలిసిందే. అయినప్పటికీ రాష్ట్రప్రభుత్వ నిర్బంధాన్ని ఏమాత్రమూ లెక్క చేయకుండా రాష్ట్ర రాజధాని విజయవాడను ఉగ్రరూతలూగించిన జ్ఞాపకాల్ని మరువక ముందే మరోసారి ధర్మపోరాటాన్ని ప్రారంభించింది. ఉద్యమసెగ ధాటికి రాష్ట్రప్రభుత్వం ఒక్కసారిగా ఉలిక్కి పడింది. తదనంతర ఉద్యమాలపై మరింత అణచివేత చర్యలకు పాల్పడిన సంగతి తెలిసిందే. ఇటువంటి పరిస్థితుల నేపథ్యంలో సార్వత్రిక ఎన్నికల సమయం దగ్గర పడడంతో పాలకుల వైఖరి సడలిపోయే అవకాశం ఉంది. ఇటువంటి పరిస్థితుల నేపథ్యంలో 2024 సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో కార్మి కులు, కర్షకులు, ఉద్యోగులు తమ న్యాయమైన హక్కుల్ని సాధించుకోవడానికి ఉద్యమించాల్సిన తరుణం ఆసన్నమైంది. ఇందుకు ఇంతకు మించిన సమయం మరొకటి లేదనేది నిష్ఠుర సత్యం. ఇటువంటి పరిస్థితుల నేపథ్యంలో జిల్లాలోని కార్మిక, కర్షక, ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాల నాయక త్వాలు సమిష్టిగా ముందుకు కదలాల్సి ఉంది. లేనిపక్షంలో కార్మిక, కర్షక, ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలు తమ న్యాయబద్ద మైన హక్కుల్ని సాధించుకోవడం గగనమేనని సత్యాన్ని గ్రహించాలి. వీటితో పాటు మిగిలిన సంఘాల నాయకత్వాలు సమిష్టిగా ఒకరికి ఒకరు సహకరించుకుంటూ తమతమ న్యాయబద్ధమైన హక్కుల సాధనకు ఉద్యమించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

-ప్రజాశక్తి - కడప ప్రతినిధి

తగ్గిన అరటి ధర.. రైతుల్లో ఆందోళన

వేసవిలో మార్కెట్లోకి మామిడి కాయలు రావడమే కారణం..

ప్రజాశక్తి - పులివెందులరూరల్

అరటి ధరలు తగ్గిపోవడంతో రైతుల్లో ఆందోళన నెలకొంది. ప్రతి వేసవిలో అరటి ధరలు క్వింటా రూ.6000 నుంచి పడిపోతోంది. ఈ నేపథ్యంలో అరటి రైతులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. వేసవిలో మామిడి కాయలు మార్కెట్లోకి విరివిగా వస్తాయి. వీటి పట్ల వ్యాపారులు మొగ్గు చూపుతారు. అరటి కొనుగోలులో వ్యాపారులు అంతగా ఆసక్తి కనబరచరని రైతులు పేర్కొంటున్నారు. వేసవి కావడంతో వివిధ రకాల పండ్లు మార్కెట్లోకి అందుబాటులోకి వస్తాయి. మామిడితోపాటు కళింగర, కర్బూజా, బొప్పాయి, జామ పండ్లు కొనుగోలు ఎక్కువగా ఉంటుంది. ఈ పరిస్థితుల్లో జిల్లాలో అరటికి అంత డిమాండ్ ఉండదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పులివెందుల నియోజకవర్గం పరిధిలో చక్రాయపేట మండలం మినహా మిగిలిన అన్ని మండలాల్లో అరటి సాగుకు ఈ ప్రాంత నేలలు ప్రసిద్ధి. అరటి పంట సాగుకు సంబంధించి పులివెందల నియోజకవర్గ పరిధిలో పులివెందులలో 3,332.05 హెక్టార్లు, లింగాల మండలంలో 7,370.04హెక్టార్లు. సింహాద్రిపురం మండలంలో 376.85 హెక్టార్లు, తొండూరు మండలంలో 64.57 హెక్టార్లు, వేంపల్లి మండలంలో 1,709.15హెక్టార్లు, వేముల మండలంలో 1,986.06హెక్టార్లలో అరటి సాగవుతుంది. మామిడి సాగుకు సంబంధించి ఉద్యానశాఖ అధికారుల సమాచారం మేరకు చక్రాయపేట మండలంలో 3,380.67 హెక్టార్లు,

పులివెందుల మండలంలో 100.49హెక్టార్లు, సింహాద్రిపురం మండలంలో 7.73 హెక్టార్లు, తొండూరు మండలంలో 92.11హెక్టార్లు. వేంపల్లి మండలంలో 671.58 హెక్టార్లు, వేముల మండలంలో 39.26 హెక్టార్ల ప్రకారం మామిడి సాగవుతుంది. అరటి పంటసాగుకు లక్షలు వెచ్చించాల్సి ఉంది. దిగుబడి చేతికందే సమయంలో కొన్ని చోట్ల టన్ను రూ.6,000, మరికొన్నిచోట్ల అంతకన్నా తక్కువగా ఉండడంతో అరటి రైతులు నష్టాన్ని చవిచూడాల్సి వస్తోంది.

గిట్టుబాటు ధర అమలుకు ప్రభుత్వం కృషి

పసుపు కొనుగోలు కేంద్రం ప్రారంభంలో తిరుపేల్‌రెడ్డి, జెసి గణేష్‌కుమార్

పసుపు కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న తిరుపేల్‌రెడ్డి, జెసి గణేష్‌కుమార్

ప్రజాశక్తి - చాపాడు

రైతు పండించిన పంటకు గిట్టుబాటు ధర అమలుకు ప్రభుత్వం కృషి చేస్తుందని రాష్ట్ర వ్యవసాయ శాఖ సలహాదారులు ఇరగంరెడ్డి తిరుపాల్ రెడ్డి, జాయింట్ కలెక్టర్ గణేష్‌కుమార్ తెలిపారు. స్థానిక మార్కెట్ యార్డు ఆవరణలో శనివారం మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పసుపు కొనుగోలు కేంద్రాన్ని తిరుపేల్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా 6 పసుపు కొనుగోలు కేంద్రాలను ప్రారంభించేందుకు యత్నిస్తున్నామన్నారు. మార్కెట్లో క్వింటా ధర రూ.5వేలు మాత్రమే ఉండగా, ప్రభుత్వం రూ.6850 మద్దతు ధర కల్పిస్తోందన్నారు. గతంలో మైదుకూరు మార్కెట్ యార్డ్ నుండే రూ.5 కోట్లు ఉల్లి కొనుగోలు చేసి రైతులకు లబ్ధి చేకూర్చిందన్నారు. అలాగే 2020-21లో 21,237 క్వింటాళ్లు పసుపు కొనుగోలు చేసి రైతులకు రూ.14.50 కోట్లు జమ చేసిందన్నారు. 2020లో జిల్లాలో 21వేల మెట్రిక్ టన్నుల వరి ధాన్యాన్ని కొనుగోలు చేయగా, అందులో మైదుకూరు నియోజకవర్గంలో పదివేల మెట్రిక్ టన్నులు సేకరించారన్నారు. పథకాలు అన్ని వర్గాల ప్రజలకు అందుతున్నాయన్నారు. ఒక్కో రైతు నుంచి 30 క్వింటాళ్లు కొనుగోలు చేపడతామని ఆయన తెలిపారు. ఉద్యాన, వ్యవసాయ సలహాదారులు సంబటూరు ప్రసాద్‌రెడ్డి, డిఎం నరసింహారెడ్డి, తహశీల్దార్ అనురాధ, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ అధికారంలోకొస్తే ఆరు సూత్రాల అమలు

ప్రజాశక్తి - ఎర్రగుంట్ల

రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే ఆరు సూత్రాల కార్యక్రమాన్ని అమలు చేస్తుందని పిసిసి మీడియా చైర్మన్ ఎన్.తులసిరెడి తెలిపారు. పట్టణ పరిధిలోని రాణివనం, మండల పరిధిలోని కదిరివారిపల్లెకు చెందిన పలు కుటుంబాలు శనివారం కాంగ్రెస్ పార్టీలో చేరాయి. ఈ సందర్భంగా ఆయన ఎర్రగుంట్లకు విచ్చేశారు. అనంతరం తులిసిరెడ్డి విలేకరులతో మాట్లాడుతూ వైసిపి, టిడిపి మేనిఫెస్టో కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోకు సరిరావని తెలిపారు. రాష్ట్రంలో రైతులకు గిట్టుబాటు ధర లభించక అప్పుల ఊబిలో కూరుకుపోయి ఉన్నారని తెలిపారు. దేశంలోనే రైతుల ఆత్మహత్యల్లో రాష్ట్రం 3వ స్థానంలో ఉందన్నారు. కౌలు రైతుల ఆత్మహత్యల్లో 2వ స్థానంలో ఉందని తెలిపారు. రాబోవు ఎన్నికల్లో వైసిపి, టిడిపిని ఓడించి కాంగ్రెస్ పార్టీని గెలిపించాలని తులసిరెడ్డి కోరారు.

కాంగ్రెస్ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న తులసిరెడ్డి

కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షులు సుబ్రహ్మణ్య శర్మ, జిల్లా ప్రధాన కార్యదర్శి ఓబయ్య, జానకిరామ్, మండల అధ్యక్షుడు జయరామిరెడ్డి, నరసింహారెడ్డి, ఉత్తన్న, నాగార్జున, వినయ్ పాల్గొన్నారు.

శ్రీకృష్ణ దేవరాయల శాసనాన్ని కాపాడుకోవాలి

శాసనమున్న శిలాఫలకాన్ని చూపిస్తున్న శివనాగిరెడ్డి

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

జిల్లాలోని పులివెందులలో విజయనగర చక్రవర్తి శ్రీకృష్ణదేవ రాయలు క్రీ.శ.1509 అక్టోబర్ 24న స్థానిక రంగనాథుని అంగరంగ భోగాలు, నైవేద్యానికి కుందలూరు గ్రామానికి దానం చేసిన శాసనం నిర్లక్ష్యానికి గురైందని పురావస్తు పరిశోధకులు, ప్లీచ్ ఇండియా ఫౌండేషన్ సిఇఒ డాక్టర్ ఇ.మని శివనాగిరెడ్డి తెలిపారు. పులివెందుల రంగనాథ స్వామి ఆలయంలో ఈ శాసనాన్ని పరిశీలించేందుకు శనివారం ఆయన విచ్చేశారు. అయితే అక్కడ ఆ శాసనం కనిపించకపోవడంతో స్థానిక పూజారిని అడగ్గా.. అతను ఎక్కడ ఉందో తమకు తెలియదని చెప్పారు. అనంతరం మని శివనాగిరెడ్డికి స్థానికులు ఇచ్చిన సమాచారం మేరకు ఊరి వెలుపల ఒక చెట్టు కింద ఆ శాసనాన్ని గుర్తించారు. ఆ శాసనం పక్కనే కూర్చొని ఉన్న రైతులకు శాసన చారిత్రకత, ప్రాధాన్యతను గురించి ఆయన వివరించారు. అలాగే దీన్ని ఆలయంలోకి గానీ, పార్కు వద్ద కానీ తరలించి భద్రంగా ఉండేలా చూసుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. శ్రీకృష్ణదేవరాయలు పట్టాభిషిక్తుడైన తర్వాత విడుదల చేసిన తొలి శాసనం పులివెందులలో ఉండడం గర్వకారణమన్నారు. ఈ శాసనాన్ని ఇప్పటి లిపి, భాషలో రాయించి ప్రదర్శించాలని ఆలయ నిర్వాహకులను, జిల్లా అధికారులను కోరారు. కార్యక్రమంలో జిల్లా మాజీ ఆ టివి శాఖ అధికారి చంద్రమోహన్‌రెడ్డి, శిల్పారామం సిఇఒ శ్యాంసుందర్ రెడ్డి పాల్గొన్నారు.

రూ.15 లక్షల పరిహారం ఇవ్వాలి : సిపిఎం

నివాళులర్పిస్తున్న సిపిఎం, డివైఎఫ్ఐ నాయకులు

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

ఒడిశాలో రైలు ప్రమాదం ఘటన చాలా బాధకరమని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు వీరనాల శివనారాయణ, డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వీరానాల శివకుమార్ తెలిపారు. సిపిఎం, డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో శనివారం సాయంత్రం స్థానిక పాత బస్టాండ్‌లో వారు కొవ్వొత్తులతో మృతులకు నివాళి అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ టెక్నాలజీ అభివృద్ధి చెందుతూ వందే భారత్ రైలు నడుస్తున్న తరుణంలో చిన్నపాటి నిర్లక్ష్యంతో వందల ప్రాణాలు బలి అయ్యాయన్నారు. రైలు ప్రమాద ఘటనపై కేంద్ర ప్రభుత్వం విచారించి బాధితులకు న్యాయం చేయాలన్నారు. బాధిత కుటుంబాలకు రూ.15 లక్షలు నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. నష్టపరిహారం ఇచ్చి చేతులు దులుపుకుంటే సరిపోదని, వారి కుటుంబాలను ఆదుకోవాలన్నారు. మళ్ళీ ఇలాంటి సంఘటనలు జరుగకుండా చూడాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కూడా తెలుగు వారి కుటుంబాలకు అండగా నిలిచి ఆదుకోవాలని కోరుతున్నామన్నారు. కార్యక్రమంలో కొండయ్య, శ్రీను, పల్ల లక్ష్మీ నారాయణ పాల్గొన్నారు.

మ్యూజియాన్ని అభివృద్ధి చేయాలి

ప్రజాశక్తి - మైలవరం

ఎంతో ఘన చరిత్ర కలిగిన మైలవరం మ్యూజియాన్ని అభివృద్ధి చేయాలని డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వీరనాల శివకుమార్ కోరారు. ఆయన శనివారం మ్యూజియాన్ని సందర్శించారు. అనంతరం శివకుమార్ మాట్లాడుతూ 1976లో ఎకరా 39 సెంటలో ఈ మ్యూజియం ప్రారంభించారన్నారు. ఇక్కడ పురావస్తు శాఖ తవ్వకాలలో బయటపడిన గండికోట రాజుల కత్తులు, అపూర్వ శిలలు మరెన్నో చరిత్ర కలిగిన వస్తువులను సందర్శనార్థం ఉంచారన్నారు. ప్రస్తుతం పాలకుల నిర్లక్ష్యంతో అభివృద్ధికి నోచుకోక 2021లో మూతవేశారన్నారు. ఇప్పటికైనా కేంద్ర, రాష్ట్ర, పురావస్తు శాఖ అధికారులు స్పందించి మ్యూజియాన్ని పునఃప్రారంభించేందుకు నిధులు కేటాయించాలని కోరారు. డివైఎఫ్ఐ నాయకులు నాగేంద్ర పాల్గొన్నారు.

ఎటిఎం కేంద్రాల్లో నగదులేక ఇక్కట్లు

ప్రజాశక్తి - ఖాజీపేట

ఖాతాదారులకు మెరుగైన సేవలు అందించాల్సిన ప్రభుత్వ రంగ బ్యాంకులు వారి సేవలను ఏమాత్రం పట్టించుకోకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ ఇబ్బందులకు గురి చేస్తున్నాయి. ఖాతాదారుల సౌకర్యార్థం ఎటిఎంలు ఏర్పాటు చేశారు. అందులో నగదు ఉంచితే.. ఖాతాదారులు తమ అవసరాలకు బ్యాంక్‌కు వెళ్లకుండా ఎటిఎంలో డబ్బు తీసుకుంటారు. అయితే ఎటిఎం కేంద్రాల్లో నగదు లేకపోవడంతో అవి అలంకారప్రాయంగా మారాయి. నగదు కోసం వెళ్లిన ఖాతాదారులు ఎటిఎంలు పనిచేయక నిరాశతో వెనుదిరిగి వస్తున్నారు. మండలంలో వివిధ బ్యాంకులకు చెందిన ఎటిఎం కేంద్రాలు నాలుగైదు వరకు ఉన్నా, ఏ ఒక్క ఎటిఎం కేంద్రంలో నగదు ఉండడంలేదని ఖాతాదారులు అలంకార ప్రాయంగా ఉంటున్నాయని ఖాతాదారులు ఆవేదన వ్యక్తపరుస్తున్నారు. ఎటిఎం సేవల రుసుం పేరుతో ఖాతాదారుల నుంచి ఛార్జీలు వసూలు చేస్తున్నా సేవలు అందించడంలో నిర్లక్ష్యంగా ఉన్నారని ఖాతాదారులు ఆవేదన చెందుతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించాలని ఖాతాదారులు కోరుతున్నారు.

నగదులేక అలంకారప్రాయంగా ఉన్న ఎస్‌బిఐ ఎటిఎం కేంద్రం

సీతారామపురంలో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

క్రమం తప్పక సైకిల్ తొక్కితే ఆరోగ్యం

ప్రజాశక్తి - చాపాడు

ప్రతిరోజు క్రమం తప్పకుండా సైకిల్ తొక్కడం వల్ల ఆరోగ్యంగా ఉండవచ్చని మండల వైద్యాధికారి డాక్టర్ రాజేష్‌కుమార్ సూచించారు. శనివారం ప్రపంచ సైకిల్ దినోత్సవం సందర్భంగా అన్ని సచివాలయాల పరిధిలో సైకిల్ ర్యాలీలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరోగ్యంగా ఉండేందుకు వ్యాయామం తప్పనిసరి అన్నారు. ఇందులో భాగంగా సైకిల్ తొక్కడం మంచి అలవాటు అన్నారు. కార్యక్రమంలో డాక్టర్ శ్రీవాణి, డాక్టర్ కావ్య మాధురి, సిహెచ్ఒ మహాదేవ యాదవ్, హెల్త్ సూపర్వైజర్ సరస్వతి, క్లస్టర్ పర్యవేక్షకులు భాస్కర్, రమేష్, నారాయణరెడ్డి, ఎంఎల్‌హెచ్‌పిలు, ఎఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.

ప్రయాణికుల పట్ల ఆర్‌టిసి సిబ్బంది ఆగ్రహం

ప్రజాశక్తి - ఖాజీపేట

ఆర్‌టిసి బస్సుల్లో పలువురు సిబ్బంది ప్రయాణికుల పట్ల ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రవాణా రంగంలో ఆర్‌టిసి అతిపెద్ద సంస్థ. సంస్థలకు ప్రయాణికులే మూలస్తంభాలు. అయితే కొందరు ఆర్‌టిసి సిబ్బంది ప్రయాణికులపై అసహనం వ్యక్తం చేస్తూ, మండిపడుతున్నారు. దీంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ప్రయాణికులు ఉన్నచోట ఆర్‌టిసి అద్దె బస్సులు ఆపకపోవడం, టిక్కెట్‌కు సరిపడ చిల్లర ఇవ్వడంలేదని ప్రయాణికులపై రుసరుసలాడుతున్నారనే ఆరోపణలు ఎక్కువగా ఉన్నాయి. స్టేజీల వద్ద ప్రయాణికులను ఎక్కించుకోవలసిన కండక్టర్లు సెల్‌ఫోన్ మాట్లాడుతూ పట్టించుకోవట్లేదని బస్సులోని ప్రయాణికులు ఆరోపిస్తున్నారు. మరి కొందరు కండక్టర్లు ప్రయాణికుల పట్ల చులకన భావం ప్రదర్శిస్తూ మండి పడుతూ చీదరించు కుంటున్నారని అంటున్నారు. ఇప్పటికైనా సంబంధిత ఉన్నతాధికారులు స్పందించి ప్రయాణికుల పట్ల గౌరవంగా వ్యవహరించేలా సిబ్బందికి సూచించాలని కోరుతున్నారు. స్టేజి ఉందోలేదో అని తెలియక కొందరు తెలియక బస్సు ఎక్కుతారని, ఆపాలని అడుగుతారని వారిపట్ల స్నేహభావంతో మెలగాలని అధికారులు సూచించాలని కోరుతున్నారు.

అంతర పంటల సాగుతో అదనపు ఆదాయం

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

అంతర పంటల సాగుతో రైతులు అదనపు ఆదాయం పొందవచ్చునని ప్రకృతి వ్యవసాయ మాస్టర్ ట్రైనర్ భాస్కర్‌రెడ్డి తెలిపారు. మండలం పరిధిలోని ఇ.కొత్తపల్లి గ్రామ పంచాయతీలో శనివారం ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా భాస్కర్‌రెడ్డి మాట్లాడుతూ నాగార్జునరెడ్డి అనే రైతు ప్రధాన పంట జామలో అంతర పంటలుగా కోస్, బెండ, మొటిక, చిక్కుడు, ముల్లంగి, క్యారెట్, బీట్రూట్, గోంగూర, మెంతికూర, కొత్తిమీర, చుక్కాకు, పాలకూర సాగు చేశారన్నారు. ప్రధాన పంట ఆదాయం వచ్చేసరికి అంతర పంటలు అదనపు ఆదాయాన్నిస్తాయని తెలిపారు. అదనపు ఆదాయం ద్వారా ప్రధాన పంటకయ్యే ఖర్చుకు వస్తుందన్నారు. ప్రకృతి వ్యవసాయం ద్వారా కషాయాలు, ద్రావణాలతో ఆరోగ్యకరమైన ఉత్పత్తులను అందించడంలో ఎంతో సంతోషంగా ఉందన్నారు. అన్ని రకాల పంటలు వేయడం వల్ల జీవ వైవిధ్యం కూడా పెరుగుతుందని, పంటల చీడపీడల కూడా తగ్గుతాయని ఆయన సూచించారు. రైతులందరూ ఈ పద్ధతులు పాటించి ఆదాయాన్ని పెంచుకోవాలని కోరారు. కార్యక్రమంలో యూనిట్ ఇన్‌ఛార్జి చంద్రశేఖర్, శివయ్య, ఇంటర్నల్ కమ్యూనిటీ రిసోర్స్‌పర్సన్ పద్మావతి పాల్గొన్నారు.

నేతన్న సంక్షేమానికి జగన్ పెద్దపీట

ప్రజాశక్తి - జమ్మలమడుగు

పనిముట్లను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

రాష్ట్రంలో నేతన్నల సంక్షేమానికి సిఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి కృషి చేస్తున్నారని ఎమ్మెల్యే డాక్టర్ మూలె సుధీర్‌రెడ్డి తెలిపారు. మండలంలోని మోరగుడి గ్రామంలో శనివారం జడ్పీ హైస్కూల్ ఆవరణలో చేనేత క్లస్టర్‌లకు ప్రభుత్వం రాయితీతో ఇచ్చిన పనిముట్లను లబ్ధిదారులకు ఎమ్మెల్యే పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేనేతల అభివృద్ధికి విశేష కృషి చేస్తున్నాయన్నారు. క్లస్టర్‌లో వంద మంది సభ్యులు ఉంటారని, వారికి ఒక్కొక్క క్లస్టర్‌కు రెండు కోట్ల రూపాయలు బడ్జెట్ ఉంటుందన్నారు. ఈ నిధులు క్లస్టర్ యజమానులకు రెండు పర్యాయాలుగా అందించడం జరుగుతుందన్నారు. తద్వారా చేనేత కళాకారులకు శిక్షణతోపాటు 90శాతం రాయితీతో చేతిమగ్గాలు, జాబ్‌కార్డ్స్ ఇవ్వనున్నట్లు తెలిపారు. హస్తకళల కార్పొరేషన్ చైర్‌పర్సన్ బడిగింజల విజయలక్ష్మి మాట్లాడుతూ చేనేత కళాకారులకు క్లస్టర్ల ద్వారా అత్యధిక డిజైన్స్‌పై శిక్షణనివ్వడం జరుగుతుందన్నారు. వైయస్సార్ నేతన్న నేస్తం ద్వారా సిఎం చేనేత కళాకారులకు నాలుగు పర్యాయాలు రూ.24వేలు అందించారన్నారు. కార్యక్రమంలో ఆర్‌డిఒ శ్రీనివాసులు, ఎడి భీమయ్య, బిసి సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బడిగింజల చంద్రమౌళి, ఎపిసిఒ డైరెక్టర్ వెంకటేష్, మండల అధ్యక్షురాలు వంగల హరిత, వైసిపి బిసి సెల్ జిల్లా ఉపాధ్యక్షులు ఆంజనేయులు, బుశెట్టి నిరంజన్, పాండురంగ స్వామి, భాస్కర్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

ప్రజలకు ఇచ్చిన హామీల మాటేమిటి..?

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

నాలుగేళ్ల క్రితం జగన్ ప్రజాసకల్ప యాత్రలో భాగంగా ప్రొద్దుటూరు ప్రజలకు ఇచ్చిన హామీల మాటేమిటని ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్‌రెడ్డిని టిడిపి ఇన్‌ఛార్జి జివి ప్రవీణ్ కుమార్‌రెడ్డి ప్రశ్నించారు. తన కార్యాలయంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. ముందుగా నారా లోకేష్ యువగళం పాదయాత్రను నియోజకవర్గంలో విజయవంతం చేసిన సందర్భంగా ప్రతి సీనియర్ టిడిపి నాయకులకు, కార్యకర్తలకు, అభిమానులకు, సహకరించిన పోలీసులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. నాలుగేళ్ల క్రితం జగన్ ప్రొద్దుటూరు ప్రజలకు ఇచ్చిన తొమ్మిది హామీలపై ఎమ్మెల్యే స్పష్టమైన సమాధానం ఇవ్వాలని కోరారు. వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వస్తే ఇల్లు లేని ప్రతి ఒక్కరికి రెండు సెంట్లు స్థలం, ఒకపక్క బీగం, మరోపక్క అమ్ముకునేందుకు అర్హత కల్పిస్తామన్నారన్నారు. ఏ హామీని నెరవేర్చకపోతే తాను రాజకీయాల్లో కొనసాగనని ఇంటికే పరిమితమవుతానన్న ఎమ్మెల్యే మాటలు ఏమయ్యాయని నిలదీశారు. కుందూ, పెన్నా వరద కాలువ పూర్తి చేశారా, ప్రతి సంవత్సరానికి రూ.500 కోట్లు నిధులతో అభివృద్ధి పనులకు ఖర్చు పెట్టారా, 6000 మంది స్వర్ణకార కార్మికులను ఆదుకుంటామన్న హామీ నెరవేర్చారా, దోమలు లేని ప్రొద్దుటూరును నెలకొల్పి తప్పెట్లతో ప్రొద్దుటూరు అల్లుళ్లను ఆహ్వానిస్తానన్న హామీ ఏమైందన్నారు. అలాగే పలు హామీల గురించి ఎమ్మెల్యే స్పష్టమైన సమాధానమివ్వాలన్నారు. నాయకులు బండి విజయభాస్కర్‌రెడ్డి పాల్గొన్నారు.

మాట్లాడుతున్న జివి ప్రవీణ్‌కుమార్‌రెడ్డి

నేడు సాంస్కృతిక కార్యక్రమాలు

ప్రజాశక్తి- పులివెందుల రూరల్

పట్టణంలోని శ్రీ రంగనాథ స్వామి దేవస్థానం సమీపంలో ఉన్న వైయస్సార్ మెమోరియల్ పార్కులో 'మా ఊరి సినిమా' యూనిట్ సభ్యుల ఆధ్వర్యంలో మై టివిఎస్, చాయ్ బంక్, బావార్చి వారి సహకారంతో ఆదివారం సాయంత్రం సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు హీరో మహేష్, చిత్ర యూనిట్ సభ్యుడు రైతుబిడ్డ హరి ఒక సంయుక్త ప్రకటనలో తెలిపారు. ముఖ్యఅతిథిగా మున్సిపల్ చైర్మన్ డాక్టర్ వల్లెపు వరప్రసాద్ హాజరు అవుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వారు ప్రజలను కోరారు.

వేరుశనగ విత్తనాలు పంపిణీ చేస్తున్న చంద్రఓబుల్‌రెడ్డి

సబ్సిడీ విత్తనాలను సద్వినియోగం చేసుకోవాలి

ప్రజాశక్తి - వేంపల్లె

రాష్ట్ర ప్రభుత్వం అందించే సబ్సిడీ విత్తనాలు, ఎరువులను రైతులు సద్వినియోగం చేసుకోవాలని వైసిపి మండల కన్వీనర్ చంద్రఓబుల్‌రెడ్డి, సర్పంచు రాచినేని శ్రీనివాసులు కోరారు. స్థానిక 5వ రైతు భరోసా కేంద్రంలో శనివారం వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో సబ్సిడీ వేరుశనగ విత్తనాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 40 శాతం రాయితీతో రైతులకు వేరుశనగ విత్తనాలను సరఫరా చేస్తున్నట్లు చెప్పారు. వేరుశనగ కాయలు పూర్తి ధర క్వింటాళ్ల రూ.9,300 కాగా.. అందులో 40 శాతం రాయితీ పోనూ రూ.3,720 చెల్లించాలన్నారు. రాయితీపై 30కిలోల బస్తా ధర రూ.1674 అన్నారు. ప్రతి రైతుకు 3 ప్యాకెట్లు విత్తనాలను పంపిణీ చేస్తామన్నారు. అవసరమైన వారు రైతు భరోసా కేంద్రం వద్ద తమ పేర్లను నమోదు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మార్కెట్ యార్డు డైరెక్టర్ రామకృష్ణారెడ్డి, వైసిపి నాయకులు రాచినేని వేణు, ఎంపిడిఒ మల్లికార్జునరెడ్డి, వ్యవసాయ అధికారి రాజేంద్రప్రసాద్, గంగాధర్, శంకరయ్య, రైతులు, రైతు భరోసా సిబ్బంది పాల్గొన్నారు.

లోకేష్‌ది రౌడీ మనస్తత్వం : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు

మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాచమల్లు

తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి లోకేష్‌ది రౌడీ మనస్తత్వం అని ప్రతి పక్షంలో ఉన్నప్పుడే పోలీసులపై జులుం ప్రదర్శిస్తున్నాడని, అధికారంలో ఉంటే ప్రభుత్వ ఉద్యోగులను ఇంటి బంట్రోతుల్లా చూస్తాడని ఎమ్మెల్యే రాచమల్లు ప్రసాదరెడ్డి అన్నారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో శనివారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. రిలయన్స్ పెట్రోల్ బంకు వద్ద ఆకతాయి ఆటోడ్రైవర్ కోడిగుడ్డు విసరగా అది లోకేష్ భద్రతా సిబ్బందికి తగిలిందన్నారు. ఆ ఆకతాయిపై టిడిపి శ్రేణులు దాడి చేయగా పోలీసులు అడ్డుకునే క్రమంలో రాజుపాలెం ఎస్ఐ రాజగోపాల్ యాదవ్‌కు గాయాలయ్యాయన్నారు. ఇదే పెట్రోల్ బంకు వద్ద సిఐలు ఇబ్రహీం, రాజారెడ్డిలను లోకేష్ దుర్భాషలాడారన్నారు. వివేకా హత్య నేపథ్యంలో లోకేష్ గోడపత్రాన్ని ప్రదర్శిస్తుండగా శాంతిభద్రతలు లోపిస్తాయేమోననే ఆలోచనతో ఇన్‌ఛార్జి డిఎస్‌పి నాగరాజు వారించగా ఆయనను లోకేష్ దుర్భాషలాడారన్నారు. లోకేష్ తీరును ప్రజలు బహిరంగంగా విమర్శి స్తున్నారన్నారు. ప్రొద్దుటూరు టిడిపి అభ్యర్థి ఎవరనేది పాదయాత్ర సందర్భంగా అర్థమైపోయిందన్నారు. మాజీ ఎమ్మెల్యే లింగారెడ్డి శక్తిసామర్థ్యాలు సున్న అన్నారు. వైఎస్ హయాంలో ఓ వెలుగు వెలిగిన వరదరాజులరెడ్డి చిన్న బుచ్చుకున్నారన్నారు. పాదయాత్రలో తనను తిట్టడం, టిడిపి నాయకులను పొగడడం మినహా ప్రజాప్రయోజనం శూన్యమన్నారు.

గ్రామ పంచాయతీ అభివృద్ధికి కృషి

ప్రజాశక్తి - చాపాడు

సర్పంచు శివప్రసాద్

గత పంచాయతీ ఎన్నికల్లో చియ్యపాడు గ్రామ ప్రజలు తనపై నమ్మకంతో అధిక మెజార్టీతో గెలిపించారని, ఆ మేరకు గ్రామాభివృద్ధికి కృషి చేస్తున్నట్లు సర్పంచు శివప్రసాద్ పేర్కొన్నారు. శనివారం ఆయన మాట్లాడుతూ కొంత మంది నిధులు దుర్వినియోగం చేస్తున్నామని తప్పుడు ప్రచారం చేయడం తగదన్నారు. పరిశుభ్రత, తాగునీటి మోటర్లు, కల్వర్టు, సిమెంట్ రోడ్లు, విద్యుత్ బిల్లులు వంటి వాటికి రూ.16 లక్షలు ఖర్చు చేశామన్నారు. ఎమ్మెల్యే ఎస్.రఘురామిరెడ్డి, కాత్యాయని కన్స్ట్రక్షన్ ఎండి పివి రమణారెడ్డి, ఎంపిపి టి.లక్షుమయ్య సహకారంతో గ్రామాన్ని మరింత అభివృద్ధి చేస్తామన్నారు. గ్రామ ఎన్నికల సందర్భంలో ఒప్పందాలు చేసుకుంటే ఏకగ్రీవంగా సర్పంచును ఎన్నుకునేవారని, అవి కుదరకపోవడం వల్లనే పోటీలో నిలిచి ప్రజల ఆదరణతో గెలిచామని గుర్తు చేశారు. ఎన్నికల్లో ప్రజల మద్దతుతో గెలిచిన తనపై నలుగురు వార్డు మెంబర్లు తీర్మానించడం ఏంటని ఆయన ప్రశ్నించారు.

పర్యావరణంపై అవగాహన ఉండాలి

ప్రజాశక్తి - వేంపల్లె

పర్యావరణంపై ప్రతి విద్యార్థి అవగాహన కలిగి ఉండాలని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ యోగాంజనేయులు తెలిపారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలో ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో పర్యావరణంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పర్యావరణం వల్ల పలు మార్పులు వస్తాయని, వాటిని అధిగమించేందుకు కృషి చేయాలని కోరారు. అనంతరం క్విజ్ పోటీల్లో ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి డాక్టర్ ఓబుల్‌రెడ్డి, వైస్ ప్రిన్సిపల్ నాగేంద్ర, రాజారెడ్డి, శ్రీనువాసులు, విద్యార్థులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

డాక్టర్‌తో ధృవీకరించిన మటన్ కిలో రూ.699

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

పులివెందుల పట్టణంలో సామాన్య ప్రజల కోసం డాక్టర్‌తో ధృవీకరించిన మటన్ కిలో రూ.699 అందజేస్తున్నట్లు ప్రకటించారు. ఆ మేరకు మూడు రోజుల క్రితం మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్ చెప్పారు. కొన్ని రోజుల కిందట మాంసం అధిక ధరలకు అమ్ముతున్నారని, సామాన్యుడు కొనలేని పరిస్థితి ఉందని కథనాలు వచ్చాయి. ఇందుకు మున్సిపల్ సిబ్బంది స్పందించారు. మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్ వైద్యులచే పరీక్షించిన తర్వాతనే మటన్ అమ్మాలని సూచించారు. ఆదివారం పులివెందుల పట్టణంలోని రాణితోపు ఎదురుగా ఉన్న ఫిష్ హబ్ పక్కన మటన్‌స్టాలు ఏర్పాటు చేసి కిలో రూ.699తో అమ్మించనున్నట్లు చైర్మన్ తెలిపారు.

మటన్ రేట్లను ఖరారు చేస్తూ బ్యానర్

అన్నదానానికి రూ.1.32 లక్షల విరాళం

ప్రజాశక్తి - చక్రాయపేట

జిల్లాలో ప్రసిద్ధి చెందిన గండి వీరాంజనేయ స్వామి నిత్య అన్నదానం చేయుటకు పలువురు రూ.1,32,732 విరాళం అందజేసినట్లు ఆలయ అసిస్టెంట్ కమిషనర్ అలవలపాటి ముకుందారెడ్డి తెలిపారు. సింహాద్రిపురం మండలం హిమకుంట్ల యుఎస్ఎ వాస్తువులు విష్ణుశంకర్‌రెడ్డి ధర్మపత్ని నవీన్ రూ.82,500, తొండూరు వాసులు బూచుపల్లి గంగిరెడ్డి రూ.25,116, ఖాజీపేట మండలం భాకరాపురం వాస్తవ్యులు తల్లపురెడ్డి. ఆంజనేయరెడ్డి రూ.25,116 అందజేసినట్లు గండి దేవస్థానం చైర్మన్ పినుబోలు రాఘవేంద్ర ప్రసాద్ పేర్కొన్నారు. విరాళాలు అందజేసిన వారికి ప్రత్యేక దర్శనం చేయించి,ఆంజనేయ స్వామి చిత్రపటాన్ని, తీర్థ ప్రసాదాలను అందజేశారు.

ఆంజనేయస్వామి చిత్రపటాన్ని ఇస్తున్న ముకుందారెడ్డి